గణనాథుడికి ఘనంగా పూజలు

జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని వాడవాడల గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదివారం రెండో రోజు భక్తులు వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో అన్నదానం చేశారు. 9రోజుల పాటు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించిన అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.
- సాక్షి నెట్‌వర్క్


నెహ్రూసెంటర్: ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గణేశుడి విగ్రహం వద్ద భక్తుల పూజలు


మహబూబాబాద్ రూరల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు


నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారంలో..


మరిపెడలో..


మహబూబాబాద్: కంకరబోడ్ ప్రాంతంలో..


గార్ల: గౌడసంఘం భవనంలో..


నర్సింహులపేటలోని శివాలయం సన్నిధిలో..


గూడూరు: పూజలో పాల్గొన్న భక్తులు


గూడూరు: పంచముఖ గణనాథుడు


కురవి: వీరన్న సన్నిధిలో..


డోర్నకల్ యాదవనగర్‌లో..

క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



మరిపెడ: ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరిపెడలోని మహాత్మజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పాఠశాలకు వెళ్లారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

గణనాథుడికి.. కొండెంగ కాపలా

వానరాలు రాకుండా ఏర్పాటు



కేసముద్రం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేశుడి మండపంలో వానరాలు వచ్చి పూజా సామగ్రిని ఆగం చేస్తుండటంతో, కొండెంగ కాపలాగా ఉంచిన ఆసక్తికర సంఘటన కేసముద్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడి విగ్రహాన్ని శనివారం ఏర్పాటు చేశారు. అయితే గతంలో గణేషుడి మండపం వద్ద వానరాలు వచ్చి, పూజా సామగ్రిని ఆగం చేస్తుండటంతో నిర్వాహకులకు ఈ ఆలోచన తట్టింది. ఈ మేరకు కొండెంగను మండపం వద్ద కాపలాగా పెట్టారు. దాని కోసం ప్రత్యేకంగా బోను ఏర్పాటు చేశారు. కొండెంగను కాపలాగా ఉంచడానికి రూ.15వేల ఖర్చు అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

పూజా సామగ్రికి వెళ్తూ.. అనంతలోకాలకు

కేసముద్రం: వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి తీసుకు వచ్చేందుకు, ఓ మహిళా భక్తురాలు బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్పనపల్లి గ్రామానికి చెందిన గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షురాలు కెంచ రాజమణి(50) శనివారం వినాయక చవితి సందర్భంగా దంపతులు గణేశుడి విగ్రహాన్ని తీసుకువచ్చి, ప్రత్యేకంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పూజా సామగ్రితోపాటు, సౌండ్ బాక్స్‌కు రిపేర్ చేపించేందుకు దంపతులు బైక్‌పై కేసముద్రంస్టేషన్‌కు బయలుదేరారు. ఈక్రమంలో ఉప్పరపల్లి గ్రామ సమీపంలోకి రాగానే రాజమణి తన చేతులో ఉన్న సౌండ్ బాక్స్ ఒక్కసారిగి జారిపడుతుండగా, పట్టుకునే ప్రయత్నం చేసింది. దీంతో అదుపుతప్పి ఆమె బైక్‌పై నుంచి కింద పడింది. ఆమెను 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

కేసముద్రం: భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఇంటికన్నె గ్రామ శివారు ముత్యాలమ్మతండాలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భుక్యా శ్రీను(37), మంగమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈక్రమంలో శ్రీను కొద్దిరోజులుగా పొలం పనులకు వెళ్లకపోవడంతో, భార్య అతడిని మందలించింది. దీంతో అప్పటికే మద్యంలో మత్తులో ఉన్న భర్త క్షణికావేశంతో పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని, మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శ్రీను పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు.

వింత జంతువు పాదముద్ర..!



గార్ల: మండలంలోని సీతంపేట గ్రామ సమీపంలో 3 రోజులుగా గుర్తుతెలియని అడవి జంతువు సంచరిస్తుందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. విషయంపై ఫారెస్ట్ డీఆర్‌ఓ రమేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈ జంతువు పాదాల అచ్చులను పరిశీలించగా హైనా జంతువు లేదా పెద్ద కుక్కల అచ్చులుగా గుర్తించామని తెలిపారు.

దెబ్బతిన్న కల్వర్టు పరిశీలన

మహబూబాబాద్: దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల విషయంలో వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులోని ఏటిగడ్డ తండా వద్ద దెబ్బతిన్న కల్వర్టును మున్సిపల్ చైర్మన్, అధికారులు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్, బానోత్ సీతారాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

నెహ్రూసెంటర్: ప్రస్తుత వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖుస్నీ దవాఖానలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును ఆదివారం సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ నర్మద, స్టాఫ్‌నర్సు భవాని, సువర్ణ, విజయ, అనిత, ఫార్మసిస్టు సృజన, హెల్త్ అసిస్టెంట్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు

గార్ల/బయ్యారం: ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో పీఏసీఎస్ చైర్మన్ వడ్ల మూడి దుర్గాప్రసాద్ నేతృత్వంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, భూక్యా నాగేశ్వరరావు, మండ రాముగౌడ్, సోమేష్, రాంమూర్తిగౌడ్, సీతారాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో విఫలం

మహబూబాబాద్/డోర్నకల్: వరద బాధితులను ఆదుకోవడంతో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వరద బాధితుల కోసం ఆదివారం నిత్యావసరాలను పంపారు. హరీశ్‌రావు అందజేసిన 50క్వింటాళ్ల బియ్యం వరద బాధితులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వరద బాధితులకు రూ.10వేల నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. డోర్నకల్‌లోని ముల్కలపల్లి గ్రామంలో ముంపునకు గురైన ఇళ్లతోపాటు వరదలో కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, గుడిపూడి నవీన్‌రావు, మహేందర్‌రెడ్డి, నాయకులు చేరెడ్డి బిక్షంరెడ్డి, పంజాల మధుసూదన్, మన్యుపాట్ని, శ్రీనివాసరెడ్డి, కత్తెరసాల విద్యాసాగర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మహబూబాబాద్: నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, తదితరులు

రైతులను ఆదుకోవాలి

డోర్నకల్: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గొల్లచర్ల, చిలుకోడు, కన్నెగుండ్ల, వెన్నారం, బూరుగుపాడు, ముల్కలపల్లి, తొడేళ్లగూడెం గ్రామాల్లో పర్యటించి వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నెల్లూరి నాగేశ్వర్‌రావు, తురక రమేష్, రవి, వెంకటేశ్వర్లు, వీరన్న పాల్గొన్నారు. డోర్నకల్ మండలంలో వర్షాలతో దెబ్బతిన్న బ్రిడ్జితోపాటు రోడ్లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న డిమాండ్ చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

కురవి: రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నెల్లూరు నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పరిశీలించారు.

పొంగి ప్రవహిస్తున్న పాకాల ఏరు


గార్ల: ఉధృతంగా ప్రవహిస్తున్న పాకల ఏరు


చిన్నగూడూరు: ఆకేరువాగు వద్ద బ్రిడ్జికి నిచ్చెన వేసి బైక్ ఎక్కిస్తున్న వాహనదారులు

గార్ల: వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గార్ల సమీపంలోని పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ప్రవాహం తగ్గక పోవడంతో మండలంలోని రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలు నిత్యావసరాలు తీర్చుకునేందుకు మండల కేంద్రమైన గార్లకు రాలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు

చిన్నగూడూరు: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగుల్లో భారీగా వరద నీరు చేరి మండలంలోని ఆకేరు, జిన్నెలవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల ఉధృతికి ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నగూడూరు–ఉగ్గంపల్లి మధ్య వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రయాణికులు బ్రిడ్జికి ఇనుప నిచ్చెన వేసి తాడు సాయంతో ద్విచక్రవాహనాలను ఎక్కించి రాకపోకలు సాగిస్తున్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు జేవీవీ కృషి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్ అర్బన్: మూఢనమ్మకాల నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు, విద్య, ఆరోగ్యం, సమాజిక అభివృద్ధి, సాంస్కృతిక వికాసానికి జన విజ్ఞాన వేదిక(జేవీవీ) కృషి చేస్తోందని అడిషనల్ కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివారం ఏర్పాటు చేసిన జేవీవీ నూతన కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నూతన కమిటీని ఎన్నికలను జేవీవీ రాష్ట్ర బాధ్యులు కొత్త లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కనుమార్లపూడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి శ్రీనివాస్, కోశాధికారి ఇమ్మడి సునీత, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ బి. నెహ్రూరాథోడ్, డాక్టర్ బి.అనిల్ గుప్తా, కలేరు సత్యనారాయణ, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దయానంద్, సునీత, బ్రహ్మం పాల్గొన్నారు.

పేదలపై భారం మోపుతున్న ప్రభుత్వాలు

నెహ్రూసెంటర్: దేశంలో సంపన్నులకు పన్నుల భారాన్ని మినహాయిస్తూ ప్రభుత్వాలు పేద ప్రజలపై అన్నిరకాల పన్నుల భారం మోపుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదాయాల్లో కష్టజీవుల వాటా పొందేందుకు గ్రామీణ పేదల్ని ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశంలో రైతు కూలీలకు చట్టం లేదని కూలీల అభివృద్ధి కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా పేదలకు 9రకాల సరుకులను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం అల్వాల వీరయ్య, కుమ్ర మహేష్, వంగూరు వెంకటేశ్వర్లు, గోడిశాల వెంకన్న, బాణాల రాజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.నాగయ్య

మళ్లీ తెగిన తండాలకు వెళ్లే రోడ్డు


ఇటీవల తెగిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసిన గ్రామస్తులు (ఫైల్)


కొట్టుకుపోయిన రోడ్డు

నర్సింహులపేట: మండలంలో వారంరోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి జయపురంలో అన్నస్వామి కుంటకు భారీ వరద తాకిడితో కట్టకు గండిపడి రాకపోకలు బంద్ కావడంతో గ్రామస్తులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. మరమ్మతులు చేసి నాలుగు రోజులు గడవకముందే శనివారం సాయంత్రం మండలంలో కురిసిన భారీవర్షానికి వరద ఉధృతి ఎక్కువై మరమ్మతు చేసిన ప్రదేశంలోనే మళ్లీ కట్టకు గండి పడింది. దీంతో మళ్లీ రాకపోకలు బంద్ అయ్యాయి.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

తొర్రూరు: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే మూర్తినేని ధర్మారావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఓ గార్డెన్‌లో బీజేపీ పార్టీ తొర్రూరు పట్టణ, మండల రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ధర్మారావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో 18 కోట్ల సభ్యత్వంతో అతిపెద్ద పార్టీగా బీజేపీ ఆవతరించిందన్నారు. బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, లేగ రాంమోహన్‌రెడ్డి, నాగపూరి రాజమౌళి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్: కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. బందం చెరువులోని నీటిమట్టంను క్లియర్ చేసి పలు కాల్వలు తీసి పలు పనులు చేశారు. ఈసందర్భంగా పనులను ఆదివారం కమిషనర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో ఇళ్లకు విద్యుత్ మీటర్లు లేని వారికి విద్యుత్ శాఖ ఒక అవకాశాన్ని కల్పిస్తుందని, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ సింధు ఆదివారం తెలిపారు. రూ.938 చెల్లించి రశీదు తీసుకోవాలని తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

పంటల పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని నర్సింహులపేట, పడమటిగూడెం గ్రామాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆదివరాం ఏడీఏ విజయచందర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓలు విష్ణు, బాబు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం, రామానుజపూరం, ఆగపేట గ్రామాల్లో దెబ్బతిన్న రైతుల పంటలను ఆదివారం మండల వ్యవసాయాధికారి వాహిని పరిశీలించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని శనిగపురం గ్రామ శివారుకు చెందిన రాకేశ్, చందు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ కనుగొని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి శనివారం వారికి అప్పగించారు.

కూలిన ఇంటి గోడ

నెల్లికుదురు: కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని గుండ్ల రాజేందర్‌కు చెందిన ఇంటి ఒక పక్క గోడ ఆదివారం కూలిపోయింది. ప్రభుత్వ ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

వృద్ధురాలు అదృశ్యం.. కేసు నమోదు



గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గొడిశాల యాకమ్మ అనే వృద్ధురాలు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ ఆదివారం తెలిపారు. 20రోజుల క్రితం యాకమ్మ మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈమేరకు కుమారుడు రాజా ఫిర్యాదు మేరకు వృద్ధురాలిపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ మృతి


శేఖర్(ఫైల్)

తొర్రూరు/పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ జలగం శేఖర్(45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. శేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి తొర్రూరు జర్నలిస్ట్ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు.

నిలిచిన రాకపోకలు

నెల్లికుదురు: మండలంలో శనివారం కురిసి భారీ వర్షంతోరావిరాల, ఆలేరు, వావిలాల గ్రామాల పరిధిలోని కల్వర్టుపై నుంచి వరద ప్రవాహం పెరిగింది. దీంతో నెల్లికుదురు నుంచి మహబూబాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు తహసీల్దార్ రాజు, ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు.

చెరువుల పరిశీలన

దంతాలపల్లి: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి వీరన్న అన్నారు. ఆదివారం మండలంలోని వాగులు, చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌పై ప్రయాణం జాగ్రత్త

నెల్లికుదురు: వరద ఉధృతంగా ప్రవహిస్తుందని మోటారు సైకిల్‌పై ప్రయాణం చేసే వారు జాగ్రత్తంగా వెళ్లాలని ఎస్సై చిర్ర రమేష్ బాబు సూచించారు. మండలం చిన్ననాగారం గ్రామంలో శనివారం రాత్రి గ్రామ పరిధిలోని కల్వర్టుపై నుంచి ఇనుగుర్తి పాత తండాకు చెందిన ఇస్లావత్ మోహన్ తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మోటార్ సైకిల్‌తో సహా వరదలో కొట్టుకుపోయినట్లు ఎస్సై తెలిపాడు. మోహన్ కొంతదూరంలో చెట్టును పట్టుకుని నిలబడగా మోటార్ సైకిల్ కొట్టుకుపోయిందన్నారు. మోహన్ ప్రాణాపాయ స్థితినుంచి కాపాడినట్లు ఎస్సై తెలిపాడు.

చెరువు కట్ట తెగిందని వదంతులు

బయ్యారం: జిల్లాలోనే పెద్ద చెరువుగా ఉన్న బయ్యారం పెద్దచెరువు కట్ట తెగిపోయిందని శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన వదంతులు మండలవాసులతోపాటు గార్ల, డోర్నకల్, ఖమ్మం వాసులను ఆందోళనకు గురి చేశాయి. కొందరు సోషల్‌మీడియా ద్వారా ట్రోల్ చేశారు. ఎస్పీ సూచనల మేరకు ఎస్సై తిరుపతి ఆదివారం అర్ధరాత్రి చెరువు తూములు, కట్ట వద్దకు చేరుకొని అలాంటిది ఏమి లేదని పరిస్థితి బాగానే ఉందని భరోసా ఇవ్వడంతో పలువురు ఊపిరి పీల్చుకున్నారు.

అన్నదానం

మహబూబాబాద్: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని వార్డు కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులోని సిగ్నల్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

వరద బాధితులకు చేయూత

మరిపెడ రూరల్: మండలంలోని బాల్నిధర్మారంలో వరద బాధితులకు మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌తో కలిసి ఆదివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. సీతారాంతండాలో మాజీ ఎంపీపీలు గుగులోతు అరుణరాంబాబు, గుగులోతు వెంకన్న బాధిత కుటుంబాలకు శనివారం రూ.1000 నగదుతో పాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుడితి మహేందర్‌రెడ్డి, గుగులోతు రాంబాబు, తేజావత్ రవీందర్‌నాయక్, దారా ఆనంద్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండలంలోని జయపురం ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు బియ్యం, సరుకులను పంపిణీ చేశారు.

నెల్లికుదురు: మండలంలోని రావిరాల గ్రామంలో వరద బాధితులకు విజ్ఞాన దర్శిని, నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్, శ్రీస్వామినాయక్ మెమోరియల్ సొసైటీల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ బాలరాజు, ఎస్సై రమేష్‌బాబు, రమేశ్ పాల్గొన్నారు.



చెరువు కాదు.. మునిగిన పొలం

కురవి/కేసముద్రం: మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని నేరడ గ్రామ శివారులోని వరిపొలం వరద నీటితో నిండిపోవడంతో చెరువును తలపిస్తోంది. నేరడ చెరువు కింద రైతులు సాగు చేస్తున్న వరి పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది.